# దత్తాత్రేయ జయంతి

Contributor: Rajeshwari P Garu



దత్తాత్రేయస్వామి దత్తావతారం విశిష్టమైనది.

శ్రీ మహావిష్ణువు యొక్క 21అవతారములలో అత్రి అనసూయల పుత్రుడు దత్తాత్రేయుడు, బ్రహ్మ కుమారుడు అత్రి, కర్దమ మహర్షి తనయ అనసూయ. అత్రి మహాముని పితృణము నుండి విముక్తి చెందుటకై తపస్సు చేయగా, ఆ తపస్సుకు మెచ్చి త్రిమూర్తులు ప్రత్యక్షమవుతారు. వారిని చూసి వారి ముగ్గురి అంశతో తనకో కుమారుడు కావాలని కోరుకుంటాడు.

త్రిమూర్తుల అంశతో అనసూయ,అత్రి దంపతులు దత్తాత్రేయుణ్ణి తనయుడుగా పొందుతారు. ఓసారి లక్ష్మి,సరస్వతి,పార్వతిదేవిలు అనసూయాదేవి పాతివ్రత్యాన్ని పరీక్షింపదలచి తమ భర్తలు ముగ్గురిని ప్రేరేపించగా వారు అభ్యాగతులుగా వెళ్ళి తమకు నగ్నంగా వడ్డించమన్నారు. మహాపతివ్రతైన అనసూయ వారిని పసిబిడ్డలుగా చేసి పాలిచ్చి పెంచసాగింది. దాంతో త్రిమూర్తులు ఆమెకు బిడ్డలయ్యారు.

అత్రి మహామునికి ఇచ్చిన వరాన్ని దత్తాత్రేయుడిగా మారి నిజం చేసారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. దత్తాత్రేయుడు ఎందరికో గురుస్వరూపుడై, ఆధ్యాత్మిక విద్యను బోధించాడు. పరశురాముడికి శ్రీవిద్యా మంత్రాన్ని ఉపదేశించాడు, అదే పరశురామతంత్రం కుమారస్వామి కూడా దత్తాత్రేయుని శిష్యుడే. ఈయన ప్రహ్లాదునికి జ్ఞానప్రదాత. కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని శిష్యుడు.సిద్ధనాగార్జునునికి రసధాతు విద్యలను బోధించింది ఈ స్వామే. యదువునకు యోగమార్గమును తెలియజేసింది దత్తాత్రేయులవారే. జ్ఞానేశ్వరుడు, ఏకనాథుడు వీరందరూ దత్తోపాసకులే. దత్తునివలన లభ్యం కానిది ఏమిలేదు.

మూడు శిరస్సులతో, ఆరు భుజాలతో, శంఖం, చక్రం, ఢమరుకం, త్రిశూలం, మాల, కమండలములను ధరించి నాలుగు కుక్కలతో, కామధేనువుతో ఒప్పారే దివ్యమంగళస్వరూపుడీయన. ఈయన మూడు శిరస్సులు సృష్టి, స్థితి, లయ కారకులైన త్రిమూర్తులకు సంకేతం కనుక దత్తాత్రేయుడు హరిహరహిరణ్య గర్భస్వరూపుడని తెలుస్తుంది.

నాలుగు కుక్కలు నాలుగు వేదాలకు సంకేతం కాబట్టి దత్తాత్రేయులవారు సకలవేదస్వరూపుడుగా భావిస్తున్నాం.

Copyright @ gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

ఇక కామధేనువు ఇది మనస్సుకు మాయకు సంకేతం. సంకల్ప వికల్పాలకు, సుఖదుఃఖాలకు కారణమైన మాయను తన యోగబలంతో కామధేనువుగా మర్చి తన వద్ద వుంచుకున్న మాయాతీతుడు దత్తాత్రేయుడు.

దక్షిణ భారతదేశంలో అవతరించిన శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీనృసింహసరస్వతి దత్తాత్రేయుని అవతారములే. స్మరిస్తే చాలు సంతోషంతో ప్రత్యక్షమయ్యే స్వామి, త్వరగా ప్రసన్నమయ్యే స్వామి దత్తుడని ఉపాసకులు చెబుతారు. పూజ, స్తోత్రం, మంత్రం, జపం, కవచం, పంజరస్తోత్రం, దత్తహృదయం, సహస్రనామం, ఇలా ఎన్నో ఉపాసనాభేదములు దత్త సాక్షాత్కారనికి వున్నాయి.

శ్రీపాదశ్రీవల్లభులు మొదటి అవతారంకాగా, రెండవ అవతారం శ్రీనృసింహసరస్వతి. మహారాష్ట్రలోని గాణ్గాపురంలోని వీరి పాదములున్నాయి. తెలంగాణాలో మాణిక్యప్రభువుల సంస్థానముంది. బెంగుళూరు దగ్గర దాదాపహాడ్ లో దత్తాత్రేయుల శ్రీపాదములున్నాయి.

మాహూర్, గిరివార్, కరంజ, ఔదంబర్, నరసింహవాడి, గాణ్గాపురము, కురుపురము, వారణాశి, భట్టగాము, పిఠాపురం, శ్రీశైలం ఇవన్నీ దత్తాక్షేత్రములు.

ఈ ప్రదేశాలు అన్నీ స్వామి వారికి ఆవాసములు.

## గురుదత్తాత్రేయునకి ఒక గృహస్త రూపం కూడా ఉంది.



అటువంటి గృహస్త రూప దత్తునకే "**అనఘస్వామి**" అని పేరు .

ఆ స్వామి అర్ధాంగి కి "**అనఘాదేవి**" అని పేరు.ఆమె సాక్షాత్తు లక్ష్మీదేవి అవతారము. అనఘాదేవి లో **శ్రీ రాజరాజేశ్వరి, మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి** లక్షణాలు నిండుగా ఉన్నాయి.

అనఘస్వామిలో **బ్రహ్మ, రుద్ర, విష్ణు** లక్షణాలు ఉన్నాయి.

అనఘుడు విష్ణు స్వరూపుడు, అనఘాదేవి లక్ష్మి స్వరూపము. ఈ దంపతులిద్దరూ నిత్యమూ తపోమయమైన జీవనం గడుపుతూ భక్తులకు తత్వ జ్ఞానాన్ని అనుగ్రహించే అతి ప్రాచీన, ఆది దంపతులు. వారికే అష్టసిద్ధులు (**అణిమా,లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యం ,ఈశిత్వం, వశిత్వం, కామావసాయితా, మహిమా) పుత్రులై అవతరించారు.**

Copyright @ gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

అనఘాదేవి యోగేశ్వరి, జగన్మాత, యోగంనందు ప్రీతి గలది. గృహం,పతి,పత్ని,పుత్రులను అనుగ్రహిస్తుంది. వంశవృద్ధిని కలిగిస్తుంది. సమస్త కోరికలను సిద్ధింపజేస్తుంది, కవితా శక్తిని, కళలను ఇస్తుంది.

ఈమెకే "**మధుమతి**" అనే పేరు కూడా కలదు.

ఈమె అనఘస్వామి భ్రూమధ్య నుండి ఉద్భవించినది. దత్తాత్రేయుడు అనఘను వామభాగమున ధరించి ఉన్న శాక్త రూపము . "**అఘము**" అంటే పాపము, ఇది మూడు రకాలు.

**అనఘము** అంటే ఆ మూడు రకాల పాపాలను నశింపజేయడం.

దత్తాత్రేయ జయంతి శుభాకాంక్షలు

త్రిమూర్త్యాత్మకమైన శక్తి-అత్రి,అనసూయ ల తపఃఫలంగా అవతరించిన పుణ్యతిధి. దత్త నామమే మహిమాన్వితమైన మహా మంత్రం గా శాస్త్రాలలో చెప్పబడింది.

అత్రి కుమారుడు కనుక ఆత్రేయుడు. ఈ రెండూ కలిపి దత్తాత్రేయుడు. ఇది గురు స్వరూపం. ఈ స్వామిని స్కందుడు,ప్రహ్లాదుడు, అలర్కుడు,పరుశురాముడు, కార్తవీర్యుడు, గోరక్షనాధుడు మొదలైన వారెందరో ఆశ్రయించి జ్ఞానాన్ని పొందారు.

పరమ కరుణామయుడైన దత్తుని స్మరించితే చాలు అనుగ్రహిస్తాడని శాస్త్రవచనం.ఈరోజు శ్రీ దత్తాత్రేయ స్వామి ని షోడశోపచారాలతో పూజించాలి.

- సేకరణ భారత ఋషిపీఠం భారతీయ మానస పత్రిక

శ్రీ SVSN Sarma గారి రచనా వ్యాసం నుంచి ( మన గురువుగారు తమ్ముడు గారు).నమస్సు గతయేడాది పత్రిక నుంచి.

🏵🙏🏵శ్రీ దత్త శరణం మమ 🏵🙏🏵

Copyright @ gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose